'తల్లికి వందనం'లో షరతులు సరికావు

ప్రజాశక్తి-హుకుంపేట: నిబంధనల పేరిట అర్హులైన తల్లికి వందనంలో కోతలు విధించడం అన్యాయమని గిరిజన మహిళా సంఘం జిల్లా కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హైమావతి మాట్లాడుతూ, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో తల్లికి వందనం పథకాన్ని అందరికీ వర్తింపజేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. స్కీం వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు కూడా ఈ పథకం వర్తింప చేయాలన్నారు.

అనంతగిరి: పలు శాఖలలో పని చేస్తున్న ఆప్కాస్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలని సిఐటియు మండల కార్యదర్శి, టోకురు సీపీఎం సర్పంచ్ కిల్లో మోస్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏపీ టూరిజం శాఖ తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో చాలీ చాలని వేతనాలు తీసుకుంటూ పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు కూడా తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న వీరికి ప్రభుత్వ పథకాలు వర్తించ లేదని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల అమలు చేయాలని డిమాండ్ చేశారు.

శిథిలావస్థలో ఉపాధ్యాయుల క్వార్టర్స్

- బయట అద్దె ఇళ్లలో టీచర్స్ నివాసం
- మరమ్మతులు చేపట్టని అధికారులు

శిథిలావస్థలో కించుమండ ఉపాధ్యాయ క్వార్టర్స్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఐటిడిఎ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్థానికంగా పాఠశాలల్లోనే అందుబాటులో ఉంటూ విద్యాబోధన అందించాలన్న ఉద్దేశంతో గతంలో నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. మండలంలోని కించుమండ, డుంబ్రిగుడలో ఉపాధ్యాయుల క్వార్టర్స్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వీటిని నిర్మించి సుమారు 20 ఏళ్ళు పైబడుతుండడంతో అవి పూర్తిగా మరమ్మత్తుకు గురై శిథిలావస్థకు చేరాయి. ఐటిడిఏ అధికారులు కూడా వాటిని మరమ్మత్తు చేపట్టక పోవడంతో కూలి పోయే పరిస్థితిలో ఉన్నాయి. దీంతో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు స్థానికంగా క్వార్టర్స్ భవనాల్లో ఉండలేక బయట అద్దె గదులను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. స్థానికంగా ఆ పాఠశాల గ్రామాల్లో అద్దె గృహాలు దొరకక పోవడంతో అరుకులోయ, పాడేరు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని కించుమండ, డుంబ్రిగుడ, నందివలస, గుంటసీమ, జాంగూడ, కిల్లోగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉండగా అక్కడ ఉపాధ్యాయుల వసతి సౌకర్యం ప్రభుత్వం ఐటిడిఎ ద్వారా గతంలో ఉపాధ్యాయుల క్వార్టర్సులను నిర్మించింది. సుమారు గత ఐయిదారేళ్ల క్రితం నుంచి శిథిలావస్థలో చేరి కూలి పోయే పరిస్థితుల్లో ఉన్నాయి. దీంతో, ఆ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు క్వార్టర్స్ భవనాల్లో ఉండలేక బయట అద్దెకు గదులను తీసుకొని పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి ఉపాధ్యాయుల క్వార్టర్స్ భవనాలను మరమ్మతు చేసి పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

శిథిలావస్థలో డుంబ్రిగుడ ఉపాధ్యాయ క్వార్టర్స్

ఘాట్‌రోడ్డులో అడవి దున్నల సంచారం

భీతిల్లుతున్న వాహనదారులు, స్థానికులు

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలం సప్పర్ల ఘాట్ రోడ్డు రెయిన్ గే జ్ పరిసర ప్రాంతాల్లో అడవి గేదెలు, దున్నలు సంచరిస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే వాహన చోదకులు భయపడుతున్నారు. పాడేరు డిపోకు చెందిన పాడేరు భద్రాచలం నైట్ సర్వీస్ బస్ శనివారం రాత్రి పాడేరు నుంచి చింతపల్లి మీదుగా భద్రాచలం వెళ్తుండగా సప్పర్ల ఘాట్‌రోడ్డు రైన్ గేజ్ వర్ధకు వచ్చేసరికి రాత్రి 8గంటల సమయంలో ప్రధానరహదారిపైకి అడవిగేదె బస్సుకు అడ్డంగా వచ్చింది. అడవి గేదే రాకను గమనించిన ప్రయాణికులు భయాందోళన గురయ్యారు. అయితే బస్‌డ్రైవర్ ఏకధాటిగా హారన్ మోగిస్తూ బస్సు వేగాన్ని పెంచి ముందుకు వెళ్లడంతో అడవి గేదె నెమ్మదిగా అడవిలోకి జారుకోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సీలేరు నుంచి మైదాన ప్రాంతానికి ఆటోలు, బైక్‌లు, ఇతర చిన్న వాహనాల్లో అనునిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో వారంతా అడవి గేదెలు చంచారంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



దారి సమీపంలో ఉన్న అడవి గేదె

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు

ఆక్రమణలు తొలగిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి -జికె. వీధి: హైకోర్టు ఆదేశాలతో అధికారులు హెచ్చరికలతో మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా అక్రమ కట్టడాలను వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. జిల్లాలో రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను తొలగించేందుకు న్యాయస్థానం ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు మండల తహశీల్దార్ టి రామకృష్ణ మండల కేంద్రంలో సర్వే నిర్వహించి ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న దుకాణదారులు సోమవారంలోగా స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని లేకుంటే అధికారికంగా యంత్రాలతో తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో ఆదివారం రెండవ రోజు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలు తొలగించుకుంటున్నారు. దీంతో రహదారికి ఇరువైపులా ఖాళీ ఏర్పడింది.

104 ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని 104 ఉద్యోగుల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. 104 రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా 104 ఉద్యోగులు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్ సూర్యనారాయణ పడాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో 104 సర్వీస్‌లను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహించిందని, ఈ సంస్థ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు రావాల్సిన బకాయి వేతనాలు ఇతర బకాయిలు (ఈఎల్ గ్రాట్యుటీ) చెల్లించాలన్నారు.

జిల్లా కార్యదర్శి రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ, ప్రస్తుతం 104 సర్వీస్‌లు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతీ నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేసారు. జిల్లా ఉపాధ్యక్షులు పవన్ కుమార్ మాట్లడుతూ, ప్రస్తుతం జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో మ్యూచువల్ బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలన్నారు. వాహనాలు గత ఐదు సంవత్సరాల నుండి మరమ్మతులకు నోచుకోలేదని, వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. 104 ఏ ఎస్ ఆర్ జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ పడాల్ మాట్లాడుతూ, ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ప్రతీ నెలా అన్నీ జిల్లాలో కూడా గ్రీవెన్స్ మీటింగ్ నిర్వహించి సమస్యలు పరిష్కారంకి చొరవ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డివిజన్ నాయకులు భీమరాజు, అప్పలరాజు, శ్రీనివాస్, నవీన్ కుమార్, గణపతి, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ పడాల్

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం

రౌండ్ టేబుల్ సమావేశంలో ఏజెన్సీ ప్రాంత రోడ్డు అభివృద్ధి వేదిక నేతలు

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంత మండల కేంద్రాలలో రోడ్ల విస్తరణ పనులు జరగవలసిందేనని, ఆదివాసి ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ఎవరు అడ్డుకున్నా సహించేది లేదని ఏజెన్సీ ప్రాంత రోడ్డు అభివృద్ధి వేదిక తెలిపింది. ఆదివారం పాడేరు గిరిజన సంఘం కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏజెన్సీ ప్రాంత రోడ్డు అభివృద్ధి వేదిక నాయకులు తీర్మానించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్న పడాల్ సభాధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి వేదిక నాయకులు కూడా రాధాకృష్ణ, వంతల నాగేశ్వరరావు, వందేమాతరం శ్రీనన్న, కిట్టుకురు జోసెఫ్, తపుల కృష్ణారావు మాట్లాడుతూ: ప్రతి మండల హెడ్ క్వార్టర్స్‌లో రోడ్డు విస్తరణ పనులు రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టకుండా నేటికీ పాడేరు, ఏజెన్సీ ప్రాంత మండల కేంద్రాలలో రోడ్డు అభివృద్ధి పనుల్లో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలు కూడా అమలు చేయకుండా రోడ్డు అభివృద్ధికి అడ్డుపడడం సమంజసం కాదన్నారు.ఆదివాసి ప్రాంతంలో పేదవాడు చిన్న గుడిసె కట్టుకుంటే ఆగ మేఘాలపై కూల్చి వేసే అధికారులు, హైకోర్టు ఆదేశాలు ఎందుకు అమలు చేయడం లేదని వారు ప్రశ్నించారు, దీన్ని బట్టి అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందన్నారు.రోడ్డు పనులు ప్రారంభించక పోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేయవలసి ఉంటుందని వారు హెచ్చరించారు. మెయిన్ రోడ్‌లో ట్రాఫిక్కు ఎక్కువగా ఉండటంతో ఎమర్జెన్సీ వాహనాలు సరైన సమయంలో ఆస్పత్రిలో చేరక అనేకమంది మృత్యువాత జరిగిన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు.ఏజెన్సీ ప్రాంత రోడ్ల అభివద్ధి వేదిక నూతన కమిటీని నియమించారు .

ముఖ్య సలహాదారుగా వందేమాతరం శ్రీనన్న, సలహాదారులుగా సాగిన ధర్మానపడాల్, కూడా రాధాకృష్ణ ,వంతల నాగేశ్వరరావు, జోసెఫ్ కిటుకూరి

కన్వీనర్‌గా జి భాను సిహెచ్ రావు, కో కన్వీనర్లు గా సిహెచ్ రాజబాబు, పిట్ట నరేష్ ,రవీంద్ర శెట్టి , కిముడు మున్నా, కిముడు శివ, పాంగి శేషు, మధుసూదన్ సుందర్ జీవన్, మహిళ నాయకులు లకే రత్నా బాయ్, రవణమ్మ ,స్వరూప, సుబ్బలక్ష్మి, విమల,శ్రీలత కమిటీ సభ్యులుగా నియమించారు. .

రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన నాయకులు

అర్హులకు వితంతు పింఛన్లు ఇవ్వండి

ప్రజాశక్తి -కొయ్యూరు : అర్హులైన వితంతువులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని మండల టిడిపి నేత, మాజీ ఎంపిటిసి బి. శివరామరాజు కోరారు. రాష్ట్రంలో కూటం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాజిక పెన్షన్ల సొమ్మును రూ.3వేల నుండి రూ.4వేలకు పెంచారన్నారు. అంతేకాక భర్త మృతి చెందిన మరుసటి నెలనుంచే వారి భార్యలకు వితంతు పింఛను మంజూరు చేయడం హర్షనీయమన్నారు. దీనికి కటాఫ్ తేదీని నిర్ణయించి 2023 డిసెంబర్ తర్వాత వితంతువులకు మాత్రమే ఇస్తామని చెప్పడం సరికాదన్నారు దీని వల్ల అంతకుముందు భర్తలను కోల్పోయిన వారంతా పింఛనుకు దూరమౌతారన్నారు. దీని వల్ల వైసిపి ప్రభుత్వ హయాంలో వితంతువులైన వారికి పింఛన్లు ఇవ్వడం లేదనే అపవాదు ప్రభుత్వంపై వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకుని, ఇప్పటికే వితంతువులుగా ఉన్న అర్హులందరికీ పింఛన్లు వర్తింపజేసి, భరోసానివ్వాల్సిన అవసరం ఉందనిబి.శివరామరాజు కోరారు.

బాధితురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డిఎంహెచ్ఒ

అస్వస్థతకు గురైన భక్తులు డిశ్చార్జ్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వాంతులు విరోచనాలతో పాడేరు సర్వజన ఆసుపత్రిలో చేరిన 19 మంది రోగుల పరిస్థితి నిలకడగా ఉందని, ఆదివారం మధ్యాహ్నం వారి కోరిక మేరకు డిశ్చార్జ్ చేయడం జరిగిందని జిజిహెచ్ ఆర్ఎంఒ జి.వెంకట్, జనరల్ మెడిసిన్ హెడ్ .సురేష్ రెడ్డి తెలిపారు. మొదకొండమ్మ అమ్మవారి దర్శనార్థం అనకాపల్లి, తూర్పు గోదావరి జిల్లాల నుండి 19 మంది భక్తులు శనివారం పాడేరు చేరుకున్నారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఆహారం తయారు చేసుకుని వచ్చి అర్ధరాత్రి తరువాత తినడంతో అది సరిగా అరగక ముందుగా వాంతులు, తదుపరి విరోచనాలు మొదలయ్యాయి. దీంతో జిజిహెచ్‌లో చేరిన సదరు భక్తులకు అత్యవసర చికిత్సలు అందజేయడంతో ముగ్గురు భక్తులు వెంటనే డిశ్చార్జ్ కాగా మిగిలిన 16 మందికి చికిత్స అనంతరం తగ్గుముఖం పట్టడంతో ఆదివారం మధ్యాహ్నం డిశ్చార్జ్ అడిగి తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారని డాక్టర్ల బృందం వివరించింది. విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా హుటాహుటిన జిజిహెచ్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు.

'వెన్నుపోటు' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి -పాడేరు: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన "వెన్నుపోటు" పుస్తకాలు ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా కేంద్రంలో పాడేరు శాసన సభ్యులు, అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, అరకు శాసన సభ్యులు రేగం మత్యలింగం . వైసీపీ నాయకులు పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, నవరత్నాల పథకాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేశారని, ఈ పథకాలను చంద్రబాబు నిర్వీర్యం చేశారన్నారు, కానీ మోసానికి మారుపేరు చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మరొక్కసారి వెన్నుపోటు పొడిచి, సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు, ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వానికి నిలదీస్తే వైఎస్ఆర్సిపి నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురస పార్వతమ్మ, ఎంపీటీసీ సల్ల చిట్టమ్మ, మాజీ ఎస్టీ సెల్ అధ్యక్షులు కమ్మిడి అశోక్, నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, అరకు నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు సమీడా వెంకట పూర్ణిమ, , నాయకులు బోనంగి వెంకటరమణ, సందడి కొండబాబు, మాజీ సర్పంచ్ శరభ సూర్యనారాయణ రాంబాబు, కూడా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు

గిరి బాలల చదువు అగమ్యగోచరం!

- జర్రెల పంచాయతీలో లేని అంగన్వాడీ కేంద్రాలు, బడులు
- విద్యకు దూరమౌతున్న ఆరు గ్రామాల ఆదివాసీ చిన్నారులు

ప్రజాశక్తి - జికె.వీధి: మారుమూల గ్రామాలకు నేటికీ పాఠశాల, అంగన్వాడీ సేవలు అందుబాటుకు నోచుకోవడం లేదని మన్యవాసులు ఆవేదన చెందుతున్నారు. జికె.వీధి మండలం జర్రెల పంచాయతీ మారుమూల గ్రామాలు కన్నీరుశిల్ప, గాడి మామిడి, గునుకురాయి, అసంపల్లి, తిరగేలమామిడి, బొడ్డలగొంది తదితర గ్రామాలకు ఇప్పటికీ పాఠశాలలు లేక పిల్లలు విద్యకు దూరమయ్యారని గిరిజన తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు గ్రామాల ప్రజలు పాఠశాలల తమ పిల్లలను చదివించుకోవడానికి ఆరు గ్రామాలకు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్ మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు వేడుకుంటున్నారు. తమ పాఠశాలల్లో అరవై మందికి పైగ పిల్లలు ఉన్నారని, అయినా అంగన్వాడీ కేంద్రంగానీ, పాఠశాలగానీ లేకపోవడం శోచనీయమని అంటున్నారు. గిరిజన విద్యపై మాటలే తప్ప, చేతల్లో కానరాని పాలకులు, అధికారుల చిత్తశుద్ధికి నిలువెత్తు నిర్లక్ష్యంగా తమ గ్రామాలున్నాయని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నాయకులు, జిల్లా అధికారులు స్పందించి తమ పిల్లలు భవిషత్తును కాపాడాలని ఆరు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. తమ గ్రామాల్లో పాఠశాలలు అంగనవాడి సెంటర్లు మంజూరు చెయ్యాలని మొరపెట్టుకుంటున్నారు.

ఆందోళన వ్యక్తం చేస్తున్న జర్రెల పంచాయతీ గిరిజనులు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

పిఎం జన్‌మన్ ఇళ్ల గ్రౌండింగ్ మేళాలో ఎంపిడిఒ ప్రసాదరావు

ఇళ్ల నిర్మాణాల ప్రారంభోత్సవంలో ఎంపిడిఒ

ప్రజాశక్తి- కొయ్యూరు : పిఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కొయ్యూరు ఎండిపిఒ జిడివి.ప్రసాదరావు సూచించారు. ఆదివారం డౌనూరు పంచాయతీ బచ్చింత గ్రామంలో హౌసింగ్ ఎఇఇ గోవింద్, సర్పంచ్ పొట్టిక భవానీ, ఎంపిటిసి బిడిజాన అప్పారావు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, కూటమి నేతలతో కలిసి హౌసింగ్ గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. పలు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణాల ప్రాప్తికి ఎప్పటికప్పుడు ప్రభుత్వం పరంగా బిల్లులు అందుతాయన్నారు.

ఆదివాసీ జెఎసి దీక్షలకు మద్దతు

మాట్లాడుతున్న ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ నేతలు

ప్రజాశక్తి- విఆర్ పురం: ఆదివాసీ సమాజ భవిష్యత్‌కు, హక్కుల పరిరక్షణకు జెఎసి చేస్తున్న కృషి, పోరాటాలకు ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పూర్తి సంఘీభావం ప్రకటించింది. జెఎసి ఆందోళనకు ఆర్థికసాయం అందజేసింది. ఆదివారం: కూనవరం మండలంలోని కోతులగుట్ట గ్రామంలో ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు మాట్లాడుతూ ఆదివాసీ డిమాండ్ల సాధనకు 32 రోజులుగా విజయవంతంగా దీక్షలు కొనసాగిస్తున్న జెఎసిని అభినందించారు. ఇదేస్ఫూర్తితో ముందుకు సాగాలని, తమ అసోసియేషన్ తరపున ఆర్థికంగా, ఇతరత్రా పూర్తిసహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించారు. ఆదివాసీ రిలే దీక్షలుకు మద్దతు ఇస్తూ పాల్గొన్న ఆదివాసి రాజకీయ నాయకులకు, ఆదివాసీ, ఉద్యోగ సంఘాలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆదివాసీ జెఎసి మూడు డిమాండ్లలో ఒకటి నెరవేరిందని, మిగిలినవి కూడా సాకారమౌతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మరింత ఎక్కువమంది దీక్షల్లో పాల్గొని, ఆదివాసీలు, జెఎసి సత్తాను తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ జెఎసి చేపడుతున్న దీక్షలకు ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున చింతూరు, ఏలూరు, కెఆర్.పురం డివిజన్లకు కలిపి రూ.పది వేల ఆర్థికసాయం అందించినట్లు వెల్లడించారు. సామాజిక బాధ్యత కలిగిన వారందరూ కూడా ఆదివాసి జెఎసి దీక్షలకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కరక అర్జున్, డివిజన్ ప్రధాన కార్యదర్శి తాటి రామకృష్ణ, సభ్యులు సొందె వెంకటేశ్వర్లు, కారెం రత్తయ్య పాల్గొన్నారు

100 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో రంపచోడవరం సిరిగిందలపాడులో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో వందమందికి ఉచిత వైద్యసేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. మిషన్ క్యాంపు ఇన్‌ఛార్జి స్వామి లోకమయానందజీ మహారాజ్ పాల్గొని వైద్యశిబిరాన్ని పరిశీలించారు. డాక్టర్ తలారి వెంకటసుబ్బారావు, డాక్టర్ పోతుల రామారావు, డాక్టర్ దాసరి ఉమమహేష్. డాక్టర్ రాయుడు శ్రీనివాస్ పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 38మందికి రక్తపరీక్షలు, ఒకరికి థైరాయిడ్ పరీక్షలు, ఆరుగురికి ఫిజియథెరపీ, ఒకరికి ఇసిజి పరీక్షలు చేశ్యూరు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. వైద్యశిబిరంలో గుండెవ్యాధుల వైద్య నిపుణులు, డాక్టర్ పోతుల రామారావు పాల్గొని, రక్తపోటు, మధుమేహం గుండె జబ్బులపై, రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు, రోగులకు, సహాయకులకు ఉచిత భోజన సదుపాయం కల్పించారు.

రోగులకు ఆరోగ్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలకు మారేడుమిల్లి అభ్యర్థులు

ప్రజాశక్తి -మారేడుమిల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా స్థాయి యోగాంధ్ర పోటీలలో మారేడుమిల్లి అభ్యర్థులు సత్తాచాటారు. శుక్రవారం పాడేరులో జరిగిన జిల్లాస్థాయి యోగాంధ్ర పోటీల్లో పల్లాల బాలప్రసాద్ రెడ్డి, గొర్లె జగన్నాధరెడ్డి, కడబాల గంగభవాని యోగాంధ్ర సోలో కేటగిరిలో జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచి విజయవాడలో ఈనెల 16 తేదీ నుండి 18 తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలలో పాల్గొంటారని ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ అన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలకు మారేడుమిల్లి మండలం నుంచి ఎంపిక కావడం సంతోషంగా ఉందని, . రాష్ట్రస్థాయిలో కూడా అద్భుత ప్రదర్శనతో సత్తాచాటి విజేతగా నిలవాలని ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాధ్ ఆకాంక్షించారు.

రహదారుల పనులు ప్రారంభించేదెన్నడో?

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో పలు గ్రామాల్లో రోడ్ల మరమ్మతు చేయక పోవడంతో వాహదారులు అవస్థలు పడుతున్నారు. అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల వచ్చే రహదారి పనులకు సుమారుగా 23కోట్లతో శంకుస్థాపనను సుమారు ఏడాది క్రితం ఆర్భాటంగా చేపట్టారు. కానీ నేటికీ పనులు మొదలు కాలేదు, అదేవిధంగా మండలంలో రాజుపేట నుండి మాకవరపాలెం వెళ్లే రహదారి, చౌడువాడ వెళ్లే రహదారి, అన్నవరం గ్రామానికి వెళ్లే రహదారి, వెంకటాపురం నుండి తడపర్తి, కొడవటిపూడి నుంచి గిరిజన గ్రామమైన కోదండరాంపురం, గొట్టువాడ శివారు అనుకు, అల్లుమయ్య పాలెం వద్ద అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు, ఇలా మండల వ్యాప్తంగా పలు రహదారులు పూర్తిగా చిద్రమై దర్శనమిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వంలో నిర్మించిన కాలనీ ఇల్లు వద్ద సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,.ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పై సంబరాలను నాయకులు చేసుకుంటున్నారు సరే.. మండలంపై హెూం మంత్రి అనిత చిన్న చూపు చూస్తున్నారంటూ పలువురు ఆరోపణ సైతం గుప్పిస్తున్నారు, కనీసం రహదారుల నిర్మాణమైన సక్రమంగా చేపట్టాలని మండల వాసులు కోరుకుంటున్నారు.

పంచగ్రామాల సమస్యపై ధర్నా

ప్రజాశక్తి-వేపగుంట : పంచ గ్రామాలు భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సింహాచలం జంక్షన్‌లో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ, ఈ సమస్యను పరిష్కరించాలంటే ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదన్నారు. ప్రభుత్వం అధీనంలోనే రెవెన్యూ, ఎండోమెంట్ విభాగాలున్నాయని, ఆ రెండు విభాగాలతో మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతుంన్నారు. సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు మాట్లాడుతూ, యువగళం పాదయాత్రలో నారా లోకేష్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 2019లో ఇచ్చిన జిఒ 229 అమలు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారం చేపట్టి ఏడాదైనా చర్యలు లేవన్నారు. కోర్టులో కేసు ఉందని, తీర్పు రాగానే పరిష్కరిస్తామని చెబుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించేలోపు ఇంటి నిర్మాణాలకు, మరమ్మతులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో విబిఎన్.ప్రతాప్, బి.రమణి, సిహెచ్ఎస్ఎస్.గోపాలకృష్ణ, పి.రామారావు, సత్యనారాయణ, వై.నాగేశ్వరరావు, బి.శంకరరావు, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు రూ.10 వేలు సాయం

ప్రజాశక్తి - చీడికాడ:ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటు ప్రమాదానికి రెండు ఆవులు కండివరం గ్రామంలో శనివారం మృతి చెందాయి. జనపరెడ్డి కళ్యాణం అనే రైతుకు సంబంధించిన రెండు ఆవులపై పిడుగులు పడడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు మండల పార్టీ నాయకులు బాధితుడికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొల్లవెల్లి రాజబాబు, మండల పరిషత్ అధ్యక్షులు కూరచా జయమ్మ నారాయణమూర్తి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సీడీసీ చైర్మన్, జిల్లా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షులు గొల్లవెల్లి స్వామి నాయుడు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, ఎంపీటీసీ గెంజి బాలాజీ, కో ఆప్షన్ ఎంపిటిసి షేక్ సూర్య నారాయణ, మొసూరి సన్నిబాబు పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్ టాప్ వితరణ

ప్రజాశక్తి- పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామానికి చెందిన బొడ్డపాటి నళిని దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీలో మూడవ సంవత్సరం (ఇసిఇ) చదువుతోంది. చదువులో ప్రతిభ కనబరుస్తూ అధ్యాపకులు, సహచర విద్యార్థుల మన్ననలు పొందుతోంది. ఈ విషయం తెకుసుకున్న పాల్మెన్ పేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మత్స్యకార యువ నాయకులు మైలపల్లి అశోక చక్రవర్తి 15 వేలు రూపాయలు అందజేయగా, శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు (ఎన్ ఎస్ ఆర్) తమ స్ఫూర్తి ఫౌండేషన్ సహాయ నిధి నుంచి 15 వేలు రూపాయలు జమ చేసి మొత్తం 30 వేలు రూపాయలు ఖరీదు గల లాప్ టాప్ ను ఆదివారం పాయకరావుపేట లో అందజేశారు. భవిష్యత్ లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నళినిని ఆశీర్వదించారు. ఈ సంధర్భంగా తనకు ఎంతో విలువైన లాప్ టాప్ ను అందజేసిన అశోక చక్రవర్తి, శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేమాల నాగమణి (బుజ్జి), స్ఫూర్తి నైనిత, నేమాల గంగాధర్ యాదవ్, ముత్తి మురళి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించాలి

-15 నుండి 30 వరకు అవగాహన

- కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు : కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ నేపద్యంలో అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ పథకాలు అందిచడమే ధ్యేయంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆదివారం పాడేరు మండలం చింతలవీధి సచివాలయంలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి దర్తీ అభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (పీఎం డిఎజుగా) జనజాతీ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పి ఎం జన్మన్) ఈనెల 15 నుండి 30 వ తేదీ వరకు గిరిజనులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమగ్రమైన గిరిజనాభివృద్ధికి పీఎం డిఎ జుగా దోహద పడుతుందన్నారు. గిరిజన ప్రాంతంలో అత్యంత వెనుకబడిన గ్రామాలలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన లబ్దిదారులను గుర్తించి ప్రభుత్వ పథకాలను అందిస్తామని స్పష్టం చేసారు. లబ్దిదారులకు ఆధార్ కార్డుల రిజిస్ట్రేషన్లు, పి ఎం జన్ ధన్ బ్యాంకు ఖాతాలు తెరవడం, కొత్త గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు, కిసాన్ కార్డులు, కులధ్రువీకరణ పత్రాలు, ఉపాధి హామీ జాబ్ కార్డులు, పోషన్ అభియాన్ నమోదు, తదితర సేవలు అందించి గిరిజనులకు లబ్ది చేకూర్చడం జరుగు తుందన్నారు. ఈ సందర్బంగా పిఎం జన్ మన్ కింద చింతలవీధి పంచాయతీలో 37 మంది లబ్దిదారులకు గృహాలు మంజూరు చేసారు. పాఠశాలలకు దూరంగా ఉన్న గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన సదుపాయాలు, వసతి సౌకర్యాలు కల్పించడానికి జిల్లాకు 22 హాస్టల్సు మంజూరయ్యాయన్నారు. సర్వ శిక్షా అభియాన్ కింద 11, గిరిజన సంక్షేమ శాఖ నుండి 22 హాస్టల్సు మంజూరయ్యాయని చెప్పారు. వంద మంది జనాభా దాటిన అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించి డోలీ మోతలను తగ్గిస్తామన్నారు. అందుకు గాను రూ. 454 కోట్లు మంజూరు జరిగిందన్నారు. పిఎం జన్ మన్ కింద 18,448 మంది ఇళ్ళకు విద్యుత్ కనెక్షన్ అందించడం జరిగిందని, మిగిలిన 490 ఇళ్ళకు కూడా కనెక్షన్లు అందిస్తామన్నారు. రూ. 70 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జ్ ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందన్నారు. జిల్లాలో 1590 సెల్ టవర్లు మంజూరు చేయడం జరిగిందని, అందులో 1208 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. ముందుగా సచివాలయం వద్ద మొక్కలు నాటిన కలెక్టర్ వైద్య శిభిరం, ఐసిడిఎస్, వెలుగు స్టాళ్లను పరిశీలించారు. అనంతరం రకాల అటవీ ఉత్పత్తులను, చిరు ధాన్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వంతల సీతమ్మ, ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు, సెంట్రల్ కాఫీ బోర్డ్ డైరెక్టర్ కే.ఉమామహేశ్వర్‌రావు, హౌసింగ్ పిడి వి.బాబు, ఐటిడిఎ ఎపిఓ ఎం. వెంకటేశ్వరరావు, ఎంపిడిఓ తేజరత్న, పిఎంయు అధికారి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో భవన నిర్మాణ కార్మికులకు కష్టాలు

ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-మధురవాడ : ప్రభుత్వ విధానాలు భవన నిర్మాణ కార్మికులను మరింత కష్టాలలోకి నెడుతున్నాయని బిల్డింగ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహాచావు పేర్కొన్నారు. మధురవాడ శ్రీకృష్ణనగర్‌లోని ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపంలో విశాఖ జిల్లా బిల్డింగ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంఘం సీనియర్ నాయకులు ప్రకాశరావు జెండాను ఆవిష్కరించారు. పి.సత్యనారాయణ నగర్, పందిరి రాము వేదికపై రాము, సత్యనారాయణ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ హాజరయ్యారు. సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు మూడేళ్ల నివేదికను ప్రవేశ పెట్టారు. నివేదికపై ప్రతినిధులు చర్చించారు. భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకుని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళతామని నిర్ణయించారు. అనంతరం ఆర్‌వి.నరసింహారావు మాట్లాడుతూ, కార్మికులకు గత పదేళ్ల నుంచి పని దొరకక తీవ్ర కష్టాలలో ఉన్నారని తెలిపారు. స్థానికంగా అనేక బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిలో స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, కార్మికులను బానిసలుగా మార్చడానికి మోడీ తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ అమలు చేసే విధానాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమలుకు పూనుకున్నారని తెలిపారు. 12 గంటల పనిదినాన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం నిర్ణయం చేస్తుందని, దానిని తిప్పి కొట్టడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని కోరారు. కూటమి ప్రభుత్వం వాటాతో కూడుకున్న పిఎఫ్, ఇఎస్‌ఐ భవన నిర్మాణ కార్మికులకు అమలు చేయాలని, సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సంక్షేమ నిధులు నుండి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహా సభల సందర్భంగా కొమ్మాది కూడలి నుంచి మధురవాడ నగరంపాలెం రోడ్డు మీదుగా భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జ్యోతీశ్వరరావు, పోలేశ్వరరావు, పి.రాజుకుమార్, పి.వెంకటరావు, డి.అప్పలరాజు, ఎస్.రామప్పడు, జి.కిరణ్, జి.మంగశ్రీ, సిహెచ్.శేషుబాబు

నేరాలు ఘోరాలు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

- మృతుల్లో భార్యాభర్తలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో ఆదివారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలు మృతిచెందగా, ఆటో బోల్తా పడి మరొకరు దుర్మరణం చెందారు.

శ్రీహరిపురంలో నివాసం ఉంటున్న జొన్నాడ సాయి, జొన్నాడ శాలిని భార్యాభర్తలు. వీరిద్దరూ ఆదివారం ఉదయం శ్రీహరిపురం నుండి నగరానికి వెళ్తున్నారు. షీలానగర్ మారుతీ జంక్షన్ దగ్గర వెనుక నుంచి వస్తున్న కంటైనర్ వీరి వాహనాన్ని ఢీకొని, కొంత దూరం ఈడ్చుకొని వెళ్లిపోయింది. దీంతో భార్యాభర్తలిద్దరూ మృతిచెందారు. సాయి గాజువాక ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం పిఠాపురం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా పడి యువకుడు దుర్మరణం

ఆటో బోల్తా పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన గాజువాక పంతులుగారు మేడ సమీపంలో చోటుచేసుకుంది. కణితి రోడ్డు ప్రశాంత్‌నగర్‌కు చెందిన బలగం సురేష్ (26), మరో ఐదుగురు కలిసి అద్దెకు ఆటో బుక్ చేసుకుని ఎన్ఎడి వెళ్తున్నారు. మార్గ మధ్యలో పంతులు గారి మేడ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవింగ్ సీటులో ఉన్న సురేష్ మృతిచెందాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపయోగంగా డిజిటల్ లైబ్రరీ

ప్రజాశక్తి- కోటవురట్ల:గత ప్రభుత్వంలో కొత్త గుట్టు వాడ గ్రామంలో ఆర్భాటంగా నిర్మాణం చేపట్టిన డిజిటల్ లైబ్రరీ భవనం వృధాగా దర్శనమిస్తుంది, 16 లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన భవనం 2023 సంవత్సరంలో నాటి ఎమ్మెల్యే గొల్ల బాబురావు ప్రారంభోత్సవం చేపట్టారు. మండల వ్యాప్తంగా గొట్టువాడ, కోటవురట్ల పీకే పల్లి, కె.విపూడి, వెంకటాపురం పాములవాక, గ్రామాలలో భవనాలు మంజూరు అయినప్పటికీ కొత్తగొట్టు వాడ గ్రామంలో మాత్రమే నిర్మాణం పూర్తి చేశారు. నిర్మించిన ఆ భవనం కూడా నాటి నుంచి నేటి వరకు లైబ్రరీ వినియోగం లోకి తీసుకురాక పోవడం విశేషం. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని వృధాగా వదిలేయడం పట్ల గ్రామస్తులు మండల వాసులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు, కూటమి ప్రభుత్వంలోనైనా భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని కోరుకుంటున్నారు.

ఆలయానికి సిసి కెమెరాల వితరణ

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయానికి ఎస్.రాయవరం మండలం గోకులపాడుకు చెందిన జనసేన నాయకులు మత్తి కార్తీక్ 4 సీసీ కెమెరాలను ఆదివారం ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజుకు అందజేశారు. ఇటీవల ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా, ఆలయ భద్రత కోసం సుమారు రూ.28వేలు విలువైన 4 సీసీ కెమెరాలను, అందుకు తగ్గ సాంకేతిక పరికరాలను అందజేశారు. ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు కార్తీక్ ను అమ్మవారి శేషవస్త్రం తో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శానాపతి అప్పారావు, విజయ్ కుమార్, ఎస్ఎస్ఎఫ్ జిల్లా మహిళా ధర్మ ప్రచారక్ కె.లలిత, గోకులపాడు జనసేన నాయకులు నక్కా శ్రీనివాస్, గొర్లె సురేశ్, ప్రగడ దుర్గా ప్రసాద్, పిల్లి నగేశ్, మాలెం రమణబాబు, ధనబాబు, ఎ.రవి పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-గొలుగొండ: కూటమి ప్రభుత్వం చెప్పిన హామీలో భాగంగా రాష్ట్రంలో తల్లికి వందనం కార్యక్రమం అమలు చేయడంపై గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు, మహిళలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ బెల్లపు కొండలరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు జలమూరి రాజేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుసుకుంటూ ముందుకు దూసుకెళ్తుందని, తల్లికి వందనం హామీ చదువుతున్న పిల్లల అందరి అకౌంట్లో డబ్బులు పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని కొయ్యూరు ఎస్ఐ పి.కిషోర్ వర్మ సూచించారు. ఆదివారం కాకరపాడు జంక్షన్ వద్ద పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బైకులు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర రికార్డులను సక్రమంగా కలిగి ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని సూచించారు. సంఘవిద్రోహక శక్తులకు సహకరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధితులకు గృహ నిర్మాణ సామగ్రి అందజేత

ప్రజాశక్తి- విఆర్.పురం: మండలంలోని పెద్దమట్టపల్లి గ్రామపంచాయతీ గుర్రంపేట గ్రామంలో మతిస్థిమితం లేని ఓ ఆదివాసి మహిళ ఇంటి నిర్మాణానికి, అలాగే రామవరం గ్రామంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆదివారం జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్‌ఖాన్ ఇంటి నిర్మాణ సామగ్రిని అందజేశారు. గుర్రంపేట గ్రామంలో మతిస్థిమితం లేని మడకం రమణమ్మ అనే ఆదివాసి మహిళకు ఇంటి నిర్మాణానికి సిమెంట్ రేకులు, పైపులు అందజేశారు. తల్లి కొడుకులు మతిస్థిమితం లేక నిస్సహాయ స్థితిలో ఉండగా, గ్రామస్తులు అభ్యర్థన మేరకు జమాల్‌ఖాన్ సాయమందించారు. రామవరం గ్రామానికి చెందిన సోలా నరసింహారావు అనే గిరిజనుడు ఇల్లు అగ్నికి దగ్ధమైన నిలువనీడ లేకుండా పోయిన నేపథ్యంలో బాధిత కుటుంబానికి తన వాహనంలోనే సిమెంట్ రేకులు, ఇనుప పైపులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుంచ నాగయ్య, ముత్తయ్య. జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు ఎస్‌కె. షాజహాన్. నాయకులు ఎండి జహంగీర్. పి.సాల్మన్ రాజు, నటరాజు, యాకుబ్ పాషా పాల్గొన్నారు.

17న పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన, సభ

- విజయవంతానికి వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమానుష యుద్ధం, మానవ హననాన్ని నిరసిస్తూ ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దగల గురజాడ విగ్రహం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన, అనంతరం సభ జరుపనున్నట్టు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. ఆ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన వామపక్ష పార్టీల జిల్లా నాయకుల సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రహమాన్, సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు కార్యదర్శి కె.దేవసహాయం, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, ఎం.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పటం నుంచి పాలస్తీనా దేశాన్ని తొలగించాలనే కుట్రతో ఇజ్రాయిల్ దాడులు చేస్తోందన్నారు. పిల్లలు, మహిళలతో సహ వేలాది మందిని బలి తీసుకుంటోందని తెలిపారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, శరణార్థుల శిబిరాలు.. ఇలా వేటినీ వదలడం లేదని, బాంబుల వర్షం కురిపిస్తోందని పేర్కొన్నారు. ఈ మారణ హోమాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ రెండింటినీ స్వతంత్ర దేశాలుగా గుర్తించడమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి భారతదేశ విదేశాంగ విధానం అలీన విధానానికి కట్టుబడి పాలస్తీనాకు అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. అయితే, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీనికి తూట్లు పొడిచి అమెరికన్ సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా మారుస్తోందని, ఇది దేశ ప్రయోజనాలకు విఘాతమని అన్నారు. దీనిని విడనాడాలని డిమాండ్ చేశారు.

సాయి శ్రేయాస్ ఫార్మా ప్రమాదంపై

సమగ్ర దర్యాప్తు ఏదీ ?

- అడుగడుగునా యాజమాన్య నిర్లక్ష్యం

- కానరాని గ్యాస్ డిటెక్టర్లు, సెన్సార్లు

- ప్రాథమిక అంచనాలకే పరిమితమైన అధికారులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పరవాడ ఫార్మాసిటీ (రాంకీ)లోని సాయి శ్రేయాస్ (ఎస్ఎస్) మందుల కంపెనీలో ఈ నెల 11న జరిగిన ప్రమాద ఘటన ఫార్మా రంగంలో భద్రతా లోపాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. ఆ రోజు రాత్రి ఇద్దరు సేఫ్టీ అధికారులు పగిరి చంద్రశేఖర్, శరగడం కుమార్ మరణించడం పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల డొల్లతనాన్ని, ప్రమాద నివారణ చర్యల లోపాలను బట్టబయలు చేసింది. అయితే, ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు కొరవడింది. హైడ్రోజన్ సల్ఫైడ్ (హెచ్2ఎస్) వాయువు పీల్చడంతో మృతిచెందినట్లు అధికారులు తమ విచారణలో ప్రాథమిక అంచనాకు వచ్చినప్పటికీ నిర్ధారణకు రావడానికి తగిన సాక్ష్యాధారాల్లేవు. ప్రమాదం నుంచి బయటపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెల్పర్ నుంచి స్టేట్‌మెంట్ తీసుకొని పలుకోణాల నుంచి విచారణ చేపడితేగానీ ప్రమాద వాస్తవాలు తెలీవని నిపుణులు అంటున్నారు. అత్యంత తక్కువ మోతాదులో (0.0005 పిపిఎం - 0.1 పిపిఎం) హెచ్2ఎస్ వాయువును గుర్తించగలిగినప్పుడు ఆ ప్రదేశానికి సేఫ్టీ అధికారులు ఎందుకు వెళ్తారన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి.

యాజమాన్య నిర్లక్ష్యం

సేఫ్టీ అధికారుల మృతికి యాజమాన్య నిర్లక్ష్యం కారణమని విచారణాధికారులు గుర్తించారు. సాయి శ్రేయాస్ కంపెనీలో రసాయన వ్యర్థాలను ఎఫ్లూయెంట్ స్టోరేజ్ ప్లాంట్‌కు పంపి, అక్కడి నుండి రాంకీ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలిస్తారు. రసాయన వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసేటప్పుడు ప్రమాదాలు జరగకుండా యాజమాన్యం తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సివుంది. కానీ సాయి శ్రేయాస్ కంపెనీలో విష వాయువులు విడుదలయ్యే అవకాశం ఉన్న ప్రాంతంలో గ్యాస్ డిటెక్టర్లు, సెన్సార్లు ఏర్పాటు చేయకపోవడం యాజమాన్య నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. డిటెక్టర్లు ఉండి ఉంటే అధిక మోతాదులో విష వాయువులు విడుదలైనప్పుడు కార్మికులు అప్రమత్తమై ప్రమాదాన్ని నివారించగలిగేవారు. సేఫ్టీ అధికారులపై ప్రమాద నెపం నెట్టి తప్పించుకోవడానికి చేస్తున్న యాజమాన్య ప్రయత్నాలకు ప్రభుత్వ యంత్రాంగం తోడైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదంలో మరో అస్పష్టత ఏమిటంటే సల్ఫర్ పంపిన ఎంతసేపటికి సేఫ్టీ అధికారులు స్టోరేజ్ ట్యాంకు వద్దకు వెళ్లారు అన్నది స్పష్టంగా లేదు. వాస్తవానికి రసాయన ఉత్పత్తి ప్రక్రియలో విడుదలయ్యే వ్యర్థాలను గుర్తించి, వాటి స్థాయిలను ప్రాసెస్ సూపర్‌వైజర్లు నియంత్రించాల్సివుంది. కానీ, వారి పర్యవేక్షణ లేకుండా సేఫ్టీ అధికారులు ఎందుకు ఎఫ్లూయెంట్ స్టోరేజ్ ట్యాంక్ వద్దకు వెళ్లారు అన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు.

మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయం

- ఒపి సేవలను విస్తృత పరిచాం

- 'ప్రజాశక్తి'తో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కెజిహెచ్‌కు వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా తాను పనిచేయనున్నట్టు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఇటీవల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెను 'ప్రజాశక్తి' పలకరించగా పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

కెజిహెచ్‌కు వైద్యం కోసం వస్తున్న రోగులు ఒపి నుంచి వైద్య సేవలు పొందే వరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మీ దృష్టికి వచ్చిందా ?

ఈ పరిస్థితి గతంలో ఉండేది. ఇప్పుడు అలా ఉండదు. రోగులకు సకాలంలో సరైన వైద్య సేవలు అందే విధంగా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. ముఖ్యంగా ఒపి సేవలను విస్తృతం చేశాం. వైద్యులు సమయపాలన పాటించేలా ఆదేశాలు జారీ చేశాం. నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది కూడా తప్పనిసరిగా సమయపాలన పాటించాలి.

ఒపిలో వైద్యులు ఏ విధంగా సేవలు అందించనున్నారు ?

ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అలాగే మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు వైద్యులు కచ్చితంగా ఒపి సేవలకు అందుబాటులో ఉంటారు. అందుకు ఏర్పాట్లు చేశాం.

వైద్యులు, ఇతర సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ ఉంటోందా ?

దీనికి సరికొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చాం. రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నదీ లేనిదీ ప్రతిరోజూ తెలుసుకోవడానికి డిప్యూటీ సూపరింటెండెంట్‌తో పర్యవేక్షణ చేస్తున్నాం. సోమవారం నేను ప్రత్యేకంగా ఈ విధి నిర్వహణలో ఉంటాను. మిగిలిన రోజుల్లో డిప్యూటీ సూపరింటెండెంట్, కొందరు వైద్యులు ఈ పనిలో ఉంటారు.

ఇటువంటి విధులు నిర్వహించే వారు ఎవరో తెలియజేస్తారా ?

మంగళవారం ప్రొఫెసర్ ఎల్.లోకనాథరావు, బుధవారం డాక్టర్ మెహర్, గురువారం ప్రొఫెసర్ రాధాకృష్ణ, శుక్రవారం ప్రొఫెసర్ జి.వాసవిలత, శనివారం డాక్టర్ వి.రవి ఈ విధులను నిర్వహించి ఏ రోజుకు ఆ రోజు నివేదికను అందిస్తారు. వారిచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తు చర్యలు ఉంటాయి.

రోగుల వైద్య సేవల పట్ల ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిసింది..నిజమేనా ?

నిజమే. ఐవిఆర్ కాల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రోగుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటోంది. తేడాలు ఉంటే వివరణ ఇవ్వాలని ఆదేశాలు వస్తున్నాయి.

మీ వైద్య రంగ ప్రస్థానాన్ని తెలియజేస్తారా ?

నేను ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థిని. ఇక్కడే చదువుకుని వైద్యురాలిగా పట్టా పొందడం, ఇక్కడే ప్రొఫెసర్‌గా పనిచేయడం విశేషం. ఇప్పుడు కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

సదస్సుకు హాజరైన వైద్యులతో సిపి శంఖబ్రత బాగ్చి

మినిస్కస్‌ను కాపాడటంపై దృష్టిపెట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ : మినిస్కస్‌ను కాపాడటంపై ఆర్థోపెడిక్ వైద్యులు దృష్టిపెట్టాలని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సల్లో వస్తున్న అత్యాధునిక విధానాలపై కిమ్స్ ఆసుపత్రి (సీతమ్మధార) ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమెరికాలో ఒక్కో వేలికి శస్త్రచికిత్స చేయడానికి కూడా స్పెషలైజేషన్ చేస్తున్నారని తెలిపారు. మన దేశంలోనూ అలా చేయాలని ఆకాంక్షించారు. సదస్సుకు ఆర్గనైజింగ్ చైర్మన్‌గా వ్యవహరించిన కెజిహెచ్ పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ ఆర్థోస్కోపీ వర్క్‌షాప్ ప్రాధాన్యతను వివరించారు. సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ గొల్లంగి శ్రీనివాస్, డాక్టర్ రాజేష్ కుమార్ రెడ్డి, డాక్టర్ సంతోష్ ఆర్ గడ్డం మాట్లాడుతూ జీవనశైలి లోపాలు, ఊబకాయం, అధిక శరీర బరువు, రోడ్డు ప్రమాదాలు, క్రీడల్లో జరిగే ప్రమాదాల కారణంగా మోకాళ్ల అరుగుదల చిన్న వయసువారిలోనూ ఎక్కువగా కనిపిస్తోందన్నారు. సాధారణంగా మోకాళ్ల అరుగుదల (నీ ఆర్థరైటిస్) అనేది 60-70 ఏళ్లు దాటిన తర్వాత ఉంటుందని, అయితే, పై కారణాలన్నింటి వల్ల అది 20 - 40 మధ్య వయసు వారిలో కూడా ఇటీవల ఎక్కువగా కనిపిస్తోందని అన్నారు. మోకాలిలో ఉండే లిగమెంట్లు, మినిస్కస్ గాయాలు అయినప్పుడు వీలైనంత త్వరగా స్పందించి తగిన వైద్యుడి వద్ద చూపించుకుని దానికి చికిత్స పొందాలని, లేకపోతే దీర్ఘకాలంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. ఈ తరహా గాయాలను ఆర్థోస్కోపీ ద్వారా నయం చేయొచ్చని, అందులో కూడా అత్యాధునిక టెక్నిక్‌లు వస్తున్నాయని తెలిపారు. విశాఖపట్నం కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఆర్థోపెడిక్ అసోసియేషన్, వైజాగ్ ఆర్థోస్కాపిక్ అసోసియేషన్‌ల సహకారంతో ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సల్లో వస్తున్న అత్యాధునిక విధానాలపై నిర్వహించిన ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఉన్న 150 మందికిపైగా ఆర్థోపెడిక్ వైద్యులు హాజరయ్యారన్నారు.

నేడు విశాఖలో సిఎం విస్తృత పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం విశాఖలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 10:40 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఆయన చేరుకుంటారు. అక్కడి నుంచి 10:50 గంటలకు బయలుదేరి 11:10 గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత టెంపుల్ ప్రాంతానికి చేరుకుని ఈ నెల 21న తలపెట్టిన యోగా దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించనున్నారు. అనంతరం యోగా వేదికల వద్దకు వెళ్తారు. 12:15 గంటల నుంచి 1:30 గంటల వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై నోవాటల్ హోటల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. భోజన విరామం అనంతరం పిఎం.పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొంటారు. తదుపరి విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చి 5:35 గంటలకు విమాన మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్తారు.

భద్రతా వాహన శ్రేణి ట్రయల్ రన్

సిఎం పర్యటన సందర్భంగా ముందస్తు భద్రతా వాహన శ్రేణి ట్రయల్ రన్‌ను ఆదివారం నిర్వహించారు. విశాఖ విమానాశ్రయం నుంచి సిఎం పర్యటించే నోవాటల్ హోటల్, ఆర్‌కె.బీచ్, ఎయు ఇంజినీరింగు కాలేజీ గ్రౌండ్స్, పిఎం.పాలెం ప్రదేశాల మీదుగా ఈ ట్రయల్ రన్ సాగింది. సిటీ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలక్టర్ మయూర్ అశోక్, డిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి, ఆర్‌డిఓ శ్రీలేఖ విమానాశ్రయంలో వివిధ శాఖల అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.